గ్రీన్ బెల్టులా.. డంపింగ్ యార్డులా?


బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో చెత్త, వ్యర్థాలతో నిండిన గ్రీన్‌బెల్టు


అక్కయ్యపాలెం జంక్షన్ సిగ్నల్ వెనుక గ్రీన్‌బెల్టు ప్రాంతంలో తొలగించిన చెట్ల కొమ్ములు

- ★ పచ్చదనం కోసం ఏర్పాటు చేసిన హరితహారాలు నేడు కళావిహీనం
- ★ పిచ్చిమొక్కలు, చెట్లకొమ్మలు, చెత్త కుప్పలతో నిండిన వైనం
- ★ తాటిచెట్లపాలెం, అక్కయ్యపాలెం, పోర్టు ఆస్పత్రి హైవేకి ఇరువైపులా ఇదే పరిస్థితి

తాటిచెట్లపాలెం: జాతీయ రహదారికి ఇరువైపుల పచ్చదనం కోసం ఏర్పాటు చేసిన గ్రీన్‌బెల్టులు నేడు కళావిహీనంగా, చెత్తకుప్పల మాదిరిగా మారాయి. వీటి నిర్వహణ చూడాల్సిన పలు శాఖలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో ఇవి నేడు కళ తప్పాయి. పచ్చని మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాల్సిన సంబంధిత అధికారులు, సిబ్బంది వీటి వైపు కనీసం చూడడం లేదు.


పోర్టు స్టేడియం పక్కన ఫెన్సింగ్ లేని గ్రీన్‌బెల్టులో పిచ్చిమొక్కలు

గతమెంతో ఘనం..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రీన్‌బెల్టులను సుందరంగా తీర్చిదిద్దారు. ఆయా ప్రాంతాల్లో పార్కులు, ఉద్యానవనాలు, క్రీడా వేదికలు, వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లతో అభివృద్ధి చేశారు. దీంతో పాటు పలు అందమైన మొక్కలతో పచ్చనదం పెంపొందించారు. కానీ గత సంవత్సర కాలంగా.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి గ్రీన్ బెల్టుల నిర్వహణ గాలికొదిలేశారు.

పిచ్చిమొక్కలు, ఎండిన మొక్కలు..

జాతీయ రహదారి-5 దారి పొడవునా తాటిచెట్లపాలెం నుండి గురుద్వారా వరకు గ్రీన్‌బెల్టులు దారుణంగా ఉన్నాయి. గ్రీన్‌బెల్టు ప్రాంతంలో పిచ్చిమొక్కలు, ఎండిపోయిన మొక్కలు, ఎక్కడెక్కడో తొలగించిన చెట్ల కొమ్మలు, భవన నిర్మాణ వ్యర్థాలతో నిండిపోయాయి. కనీసం గ్రీన్‌బెల్టుల లోకి ప్రవేశించేందుకు కూడా అవకాశం లేకుండా దట్టమైన పొదలతో నిండిపోయాయి. మరోపక్క గ్రీన్‌బెల్టు చుట్టూ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ కూడా తొలగించేశారు. దీంతో వీటికి రక్షణ లేకుండా పోయింది. పచ్చని మొక్కలు పెంచి ప్రజలకు అవసరమైన ప్రాణవాయువు అందించేందుకు ఏర్పాటు చేసిన అందమైన గ్రీన్‌బెల్టులను కాపాడాలని పలువురు కోరుతున్నారు. హైవే మధ్యలో గల గ్రీనరీలో కూడా కొన్ని చోట్ల గ్రిల్స్ తొలగించబడ్డాయి. దీంతో ప్రజలు హైవే దాటేందుకు ఈ గ్రీన్‌బెల్టులను ఉపయోగించి ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. అవసరమైన చోట గ్రీన్‌బెల్టులలో పచ్చని మొక్కలు వేసి, సాయంత్రం వేళల్లో స్థానికులు సేద దీరేందుకు బెంచీలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. రక్షణ లేని గ్రీన్‌బెల్టు ప్రాంతంలో గ్రిల్స్ ఏర్పాటు చేసి వీటి నిర్వహణను పర్యవేక్షించాలని ఆకాంక్షిస్తున్నారు.

క్లుప్తంగా

'గైస్' విద్యార్థుల యోగా సాధన


యోగా సాధన చేస్తున్న విద్యార్థులు

మురళీనగర్: యోగాంధ్రలో భాగంగా కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్)లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ పర్యవేక్షణలో జాతీయ సేవా పథకం కో ఆర్డినేటర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు యోగా సాధన చేశారు. యోగా గురువు పి.రవి విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ప్రిన్సిపాల్ వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో యోగా భాగం చేసుకోవాలన్నారు. ప్రతి రోజూ కనీసం గంట సేపు యోగా సాధన చేస్తే ఆరోగ్యంగా ఉంటామని యోగా గురువు రవి చెప్పారు. ప్రతి రోజూ ప్రాణాయామం, ధ్యానం చేయాలన్నారు. కార్యక్రమంలో గైస్ అధ్యాపకులు కేబీవీఎస్ఎస్ కుమార్, రమణ పాల్గొన్నారు.

ఉచితంగా కుట్టు శిక్షణ తరగతులు


కుట్టు శిక్షణకు హాజరైన మహిళలు

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు శ్రీనివాసనగర్‌లోని దాడి రామ్మూర్తి కల్యాణ మండపంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ సహకారంతో ఉచిత కుట్టు శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. ఉదయం, సాయంత్రం రెండు బ్యాచ్‌ల్లో మహిళలు శిక్షణ పొందుతున్నారు. 42, 43, 44, 45 వార్డులకు చెందిన మహిళలు ఉదయం 35 మంది, సాయంత్రం 28 మంది తరగతులకు హాజరవుతున్నారు. పి.వరలక్ష్మి, లోవ కుమారి మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుట్టు పనిలో బేసిక్స్ నుంచి మొదలు పెట్టి జుబ్బాలు, ఫ్రాక్స్, జాకెట్లు, డ్రెస్సులు, చుడీదార్స్ స్కర్టులు ఎలా కుట్టాలో నేర్పిస్తున్నామని తెలిపారు. శిక్షణ పూర్తయ్యాక సర్టిఫికెట్‌తోపాటు కుట్టు మిషన్ ఉచితంగా అందజేస్తామన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి


వాకర్స్‌తో మాట్లాడుతున్న జెడ్సీ రాము

మురళీనగర్: ఈ నెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము కోరారు. మురళీనగర్ వాకర్స్ పార్కును గురువారం ఆయన సందర్శించారు. వాకర్స్‌తో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. 50వ వార్డు సచివాలయం ఉద్యోగులతో జెడ్సీ చర్చించారు. యోగాంధ్రలో పాల్గొనేందుకు బస్సులు ఏర్పాటు చేశామని, టీ-షర్ట్, మ్యాట్‌లు అందిస్తామని చెప్పారు. టీడీపీ 50వ వార్డు అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలపై చర్చ


సమావేశంలో చర్చిస్తున్న క్లబ్ సభ్యులు

మురళీనగర్: మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులోని వనితా భవన్‌లో గురువారం నిర్వహించిన వనితా వాకర్స్ క్లబ్ సమావేశంలో సేవా కార్యక్రమాలపై చర్చించారు. అధ్యక్షురాలు పి.ప్రభావతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. జూలై 4న అల్లూరి సీతారామరాజు జయంతి, 7న సర్వసభ్య సమావేశం, 9న గిరిప్రదక్షిణ భక్తులకు సేవా కార్యక్రమాలు, 15న వార్షికోత్సవం, 18న బోర్డు డైరెక్టర్ల సమావేశం, నిర్వహించనున్నట్లు అధ్యక్షురాలు ప్రకటించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఎం.జయ, కోశాధికారి కె.భానుమతి, సంయుక్త కార్యదర్శి ఎం.ప్రమీలరావు, జాలీ వాకర్ ఎ.లీలావతి, బులెటిన్ ఎడిటర్ సీహెచ్ పద్మావతి, సురేంద్ర కౌర్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి


కె.కె.రాజును సత్కరిస్తున్న దొండపర్తి లక్ష్మణరావు

సీతంపేట: వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా ఇటీవల నియమితుడైన దొండపర్తి లక్ష్మణరావు(జాయ్) గురువారం పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్‌లను మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారిని దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. పార్టీ బలోపేతానికి శాయశక్తులా తన వంతు కృషి చేస్తానని లక్ష్మణరావు తెలిపారు. కార్యక్రమంలో 47వ వార్డు నాయకులు రాఘవులు, సురేష్, సాయి, రమేష్, జగజీవన్‌రావు, గంగరాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ విద్యతో పిల్లలకు బంగారు భవిత


గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో చిన్నారులతో సీడీపీవో నీలిమ, సిబ్బంది

మద్రిపాలెం: అంగన్‌వాడీ విద్య చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు బాట అని అర్బన్ సీడీపీవో నీలిమ అన్నారు. 53వ వార్డు ఆంధ్రకేసరి నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆటపాటలతో కూడిన విద్యాబోధనలో ఆరోగ్యం, పౌష్టికాహారం ఉంటుందన్న విషయాన్ని పిల్లల తల్లులకు వివరించారు. వార్డు మాజీ కార్పొరేటర్ పాలమరశెట్టి సర్సకుమారి సీడీపీవోతో కలిసి చిన్నారులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. నాలుగేళ్లు పూర్తయిన పిల్లలందరికీ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. కార్యక్రమాన్ని సెక్టార్ సూపర్‌వైజర్ జ్యోతి పర్యవేక్షించారు. ప్రథమ టీం విశాఖ జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాస్ లాల్, మహిళా సంరక్షణ కార్యదర్శులు భవాని, స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి


పార్టీ నాయకులతో చర్చిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు

మహారాణిపేట: వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు కోరారు. పార్టీ జిల్లా కమిటీకి వివిధ హోదాల్లో నూతనంగా నియమితులైన నాయకులు గురువారం పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త కె.కె. రాజుని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కె.కె. రాజు మాట్లాడుతూ పార్టీకి చక్కటి జనాదరణ ఉందన్నారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. అనంతరం మాజీ మంత్రి, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్నాథ్‌తో పార్టీ కమిటీల నిర్మాణంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ సమన్వయ కర్త మొల్లి అప్పారావు, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్, చింతలపూడి వెంకట రామయ్య, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, పార్టీ కార్యాలయ పర్యవేక్షకులు రవి రెడ్డి, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ఏడాది పాలనంతా అరాచకాలే

డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డిప్యూటీ మేయర్ సతీష్ తదితరులు

కంచరపాలెం: అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తూ చంద్రబాబు పాలన అంతా ఏడాది కాలంగా అరాచకాలతోనే సాగిందని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ విమర్శించారు. 46వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వార్డు అధ్యక్షుడు బలిరెడ్డి గోవిందరాజు ఆధ్వర్యంలో గురువారం 'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం' అనే కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం నూటికి నూరు శాతం విఫలమైందన్నారు. 2019లో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తొలి ఏడాదిలోనే మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 90 శాతానికి పైగా అమలు చేశారని గుర్తు చేశారు. నూతన వార్డు అధ్యక్షుడిగా ఎన్నికైన గోవిందరాజుని, సభ్యులను సత్కరించారు. పార్టీ బలోపేతానికి సమష్టి కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సేనాపతి అప్పారావు, కె.చిన్నా, కోట రామారావు, సింగంపల్లి రామారావు, జి.అప్పారావు, శ్రీను, బొట్టా రమణ, బొట్టా రాజు, సీతయ్యరెడ్డి, అప్పలరెడ్డి, దుర్గాభవానీ, లావణ్య, విజయలక్ష్మి, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర ఏర్పాట్లపై సమీక్ష

తాటిచెట్లపాలెం: ఈ నెల 21న విశాఖ వేదికగా జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంపై సమీక్షించేందుకు గురువారం సీతమ్మధారలోని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కార్యాలయంలో కీలక సమావేశం నిర్వహించారు. యోగాంధ్ర కార్యక్రమ ఏర్పాట్లపై పలువురు మంత్రులు చర్చించారు. విశాఖ వాసులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. యోగాంధ్ర కార్యక్రమం ద్వారా ఆరోగ్య సంరక్షణ కలుగుతుందని విష్ణుకుమార్‌రాజు అన్నారు. కూటమి నేతలు, వార్డు సభ్యులు, కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

పాఠశాల ప్రారంభమైనా.. కొనసాగుతున్న పనులు


జగన్నాథపురం పాఠశాల ముందు కుప్పలుగా వేసిన ఇసుక, పిక్క


పాఠశాలలో నిర్మిస్తున్న ఇంకుడు గొయ్యి

సీతంపేట: వేసవి సెలవుల అనంతరం పాఠశాలల ప్రారంభం నాటికి అభివృద్ధి పనులు పూర్తి చేయాల్సి ఉండగా.. అక్కయ్యపాలెం జగన్నాథపురంలోని రాజగిరి అప్పలస్వామి ప్రాథమిక పాఠశాలలో మాత్రం నేటికీ జరుగుతూనే ఉన్నాయి. ఈ నెల 12న స్కూళ్లు తెరుచుకున్నప్పటికీ ఇంకా వాటి చుట్టూ, లోపల ఫ్లోరింగ్ పనులు, ఇంకుడు గొయ్యి నిర్మాణం, ఇతర పనులు కొనసాగుతున్నాయి. దీంతో పాఠశాల ఆవరణలో ఇసుక, సిమెంట్‌తో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాల ప్రవేశ ద్వారానికి ఇరువైపులా ఇసుక, పిక్క పెద్ద కుప్పలుగా పోశారు. విద్యార్థులు, అటువైపు రాకపోకలు సాగించే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. పాఠశాల ప్రారంభమయ్యాక పనులు నిర్వహిస్తే విద్యార్థులకు ఇబ్బంది ఏర్పడుతుందని తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన పనులు పూర్తిచేయాలని కోరుతున్నారు.

పైల దివాకర్‌కు గుడివాడ అమర్‌నాథ్ పరామర్శ


దివాకర్‌ను పరామర్శిస్తున్న గుడివాడ అమర్‌నాథ్

తాటిచెట్లపాలెం: వైఎస్సార్‌సీపీ కార్యాలయ పీఆర్‌వో పైల దివాకర్‌ను తాటిచెట్లపాలెంలోని ఆయన నివాసంలో గురువారం మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పరామర్శించారు. లివర్, జాండిస్ సమస్యతో రెండు నెలలుగా బాధపడుతున్న పైల దివాకర్‌కు తక్షణ వైద్య ఖర్చుల నిమిత్తం అమర్‌నాథ్ రూ.25 వేల ఆర్థిక సాయం చేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులకు, కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అమర్‌నాథ్ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, వార్డు అధ్యక్షుడు పైడి రమణ, దుప్పలపూడి శ్రీనివాస్, బాద శ్రీను, చందనసాయి తదితరులు పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్‌లో యోగాపై అవగాహన ర్యాలీలు


ర్యాలీలో పాల్గొన్న వాల్తేర్ డివిజన్ క్రీడాకారులు

తాటిచెట్లపాలెం: అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా వాల్తేర్ డివిజన్ పరిధిలో పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రైల్వే కాలనీలు, రైల్వే స్టేషన్లు, రైల్వే కార్యాలయాల వద్ద యోగాపై అవగాహన ర్యాలీలు చేపట్టారు. క్రీడాకారులు, రైల్వే అధికారులు, స్కౌట్స్ అండ్ గైడ్స్, సివిల్ డిఫెన్స్ బృంద సభ్యులు, రైల్వే ఉద్యోగుల కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అరకు, రాయగడ, కోరాపుట్, జగదల్‌పూర్ వంటి ప్రధాన రైల్వే స్టేషన్లలో యోగాసనాలు సాధన చేశారు.

సీవోబీ జాయింట్ సెక్రటరీకి ఘన సత్కారం


కనకారావును సత్కరిస్తున్న అతిథులు

మద్రిపాలెం: సీవోబీ జాయింట్ సెక్రటరీగా ఎన్నికైన ఆర్.కనకారావును జోనల్ అధ్యక్షుడు ఆర్.వి.ఎస్.ఎస్. రావు, డివిజనల్ కో ఆర్డినేటర్ పి.ఆర్.ఎం.రావు, సీవోబీ సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరై ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జోనల్ అధ్యక్షుడు మాట్లాడుతూ సౌమ్యుడు, స్నేహశీలి అయిన కనకారావు సీవోబీ జాయింట్ సెక్రటరీగా ఎన్నికవడం గర్వకారణమన్నారు. యూనియన్ బలోపేతానికి, సమస్యల పరిష్కారానికి కనకారావు మరింత కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. పి.ఆర్.ఎం.రావు మాట్లాడుతూ శ్రామిక యూనియన్ విజయాల పరంపర కొనసాగుతున్న సమయంలో సీవోబీ జాయింట్ సెక్రటరీగా ఆర్.కనకారావు నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో యూనియన్ బలోపేతానికి కనకారావు మరింత కృషి చేయాలని, కార్మికుల సమస్యలపై మరిన్ని విజయాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. సీవోబీ జాయింట్ సెక్రటరీగా ఎన్నికైన ఆర్. కనకారావు మాట్లాడుతూ కార్మికుల సమస్యల కృషికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, అందరిని కలుపుకుని ముందుకు సాగుతానని అన్నారు. ఈ పదవి తన బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ప్రెసిడెంట్ ఎస్. రవికుమార్, ఆఫీస్ బేరర్ ఎం.వెంకటరావు, జాయింట్ సెక్రటరీ దిలీప్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పైడి రమణకు అభినందనలు


పైడి రమణను అభినందిస్తున్న వార్డు నాయకులు

తాటిచెట్లపాలెం: వైఎస్సార్‌సీపీ 45వ వార్డు అధ్యక్షుడిగా నియమితుడైన పైడి రమణకు వార్డు నాయకులు అభినందనలు తెలిపారు. తాటిచెట్లపాలెంలోని పైడి రమణ నివాసంలో గురువారం ఆయనను కలిసి తామంతా ఆయన వెంటే ఉండి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఉత్తర నియోజకవర్గ మేధావుల ఫోరం అధ్యక్షుడు జి.హరిపట్నాయక్, నానిబాబు, నేపాల్ శ్రీను, దుర్గ, సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిలో భారీ గోతులు


శంకరమఠం రోడ్డులో క్రాన్ బేకరీ వద్ద ప్రమాదకరంగా గోతులు

సీతంపేట: కూటమి ప్రభుత్వం వచ్చాక రహదారుల నిర్వహణ అధ్వానంగా మారింది. ప్రధాన రహదారుల్లో భారీ గోతులు ఏర్పడి ప్రమాదకరంగా ఉన్నప్పటికీ యంత్రాంగం పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. శంకరమఠం రోడ్‌లో క్రాన్ బేకరీ కూడలి వద్ద రోడ్డుకు రెండువైపులా పెద్ద గోతులు ఏర్పడ్డాయి. వేగంగా వస్తున్న వాహనాలు దగ్గరకు వచ్చేసరికి గోతులను చూసి వాహనాన్ని నియంత్రించలేక ప్రమాదాల పాలవుతున్నారు. కొంతమంది వాహనాలతో జారి పడుతున్నారు. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రధాన రహదారుల్లో గోతులను నెలల తరబడి పట్టించుకోకుండా వదిలేస్తున్నారని జనం మండిపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

'తిలాదానం' చిత్రంపై చర్చ



మాట్లాడుతున్న నరవ ప్రకాశరావు

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో వారాంతపు ఉత్తమ చిత్రాల ప్రదర్శనలో భాగంగా గురువారం సాయంత్రం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 2003లో జాతీయ, అంతర్జాతీయ అవార్డులు పొందిన 'తిలాదానం' తెలుగు చిత్రం ప్రదర్శించారు. 90 నిమిషాల నిడివి గల చిత్ర ప్రదర్శన అనంతరం చర్చా కార్యక్రమం జరిగింది. ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు సంధానకర్తగా వ్యవహరించి చర్చ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వర్గీయ కె.టి.ఎస్.శాస్త్రి దర్శకత్వంలో నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈ చిత్రం నిర్మించిందన్నారు. బ్రాహ్మణిక సనాతన సాంప్రదాయానికి, సమ సమాజ స్థాపనకు మధ్య జరిగే సంఘర్షణే కథాంశమన్నారు. ఈ చిత్రం నిర్మించి 22 ఏళ్లు అయినా విడుదలకు నోచుకోలేదని తెలిపారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర కళాకారుల వెల్ఫేర్ సంఘం అధ్యక్షురాలు ఇందిరా ప్రియదర్శిని, కార్యదర్శి బొట్టా నాగేశ్వరరావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాశీ విశ్వేశ్వరరావు, బి. చిన్నారావు, హుస్సేన్, చాట్ల బాబూరావు రెడ్డి, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.